సాక్షి ఒడిశా

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,54,250
బంగారం	12 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి	112 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఉత్కళమణికి భారతరత్న ప్రకటించాలి

స్వాతంత్ర్య సమరయోధుడు ఉత్కళమణి గోపబంధుకు భారతరత్న ప్రకటించాలని పలువురు కోరారు.

- 8లో.

త్వరలో దహన సంస్కారాలు



బహనాగా బజారు ట్రిపుల్ రైలు దుర్ఘటనలో హక్కుదారులు లేని 28 మంది మృతదేహాలను శాస్త్రీయ దహన సంస్కారాలతో మోక్షం కల్పించేందుకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి.

- 8లో.

న్యూస్‌రీల్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



వరల్డ్ కప్ నమూనాతో సత్యనారాయణ

బరంపురం: ప్రస్తుతం మన దేశంలో వన్డే ప్రపంచ కప్ జరుగుతున్న నేపథ్యంలో స్థానిక భేజ్జిపూర్‌లోని నీలకంఠ నగర్ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో కలపతో 0.5 మి.మీ అతిసూక్ష్మ వరల్డ్ కప్ నమూనాను రూపొందించారు. కాగా ఈ నమూనాకు శనివారం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ సందర్భంగా సత్యనారాయణకు పలువురు అభినందనలు తెలియజేశారు.

దీప్ గ్రేస్ ఎక్కాకు నగదు పురస్కారం



కాంస్య పతకంతో దీప్ గ్రేస్ ఎక్కా

భువనేశ్వర్: హాంగ్‌జౌలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు కాంస్య పతకాన్ని సాధించడంలో స్టార్ హాకీ క్రీడాకారిణి దీప్ గ్రేస్ ఎక్కా కీలక పాత్ర పోషించింది. ఈమె ప్రతిభకు పట్టం గట్టేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.50 లక్షల నగదు బహుమతిని శనివారం ప్రకటించారు. దీప్ గ్రేస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె రాష్ట్ర యువతకు రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. దేశంలోని ఔత్సాహిక క్రీడాకారులకు ఆశాకిరణమని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హత్య కేసు నిందితుడు అరెస్టు



అరెస్టైన నిందితుడు మనోజ్ కుమార్ సాహు

బరంపురం: జిల్లాలోని బెగునియాపడా బ్లాక్ పరిధి కన్యరబడి గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగిన దీపు పాత్రో హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్డీపీవో రంజన్ సాహు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులో దీపు పాత్రో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలతో నిందితుడు మనోజ్ కుమార్ సాహుని అరెస్టు చేశారు. అనంతరం తమదైన శైలిలో విచారణ జరిపి నిజాలను రాబట్టారు. పాత కక్షల కారణంగానే దీపు పాత్రోని అపహరించి, హత్య చేసినట్లు నిందితుడు తెలిపినట్లు ఎస్డీపీవో వెల్లడించారు. నిందితుడు మనోజ్ కుమార్ సాహుని సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

82 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 82 కిలోల గంజాయిని పట్టపూర్ పోలీసులు సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి శ్రీనివాస్ దాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి లగేజ్ ఆటోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో పట్టపూర్ పోలీసులు టికలపడా జంక్షన్ వద్ద రెక్కీ నిర్వహించి, వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానంతో ఒక లగేజీ ఆటోలో తనిఖీలు నిర్వహించిన 82 కిలోల గంజాయి బయటపడింది. దీంతో వాహనంతో పాటు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి టిక్కరపడా గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ గౌడగా పోలీసులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.



భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు పురోగతి సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

మెట్రోకు ముందడుగు

- జనవరి 1న పనులకు శంకుస్థాపన
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.5,929 కోట్లు
- వ్యయభారం భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- డీపీఆర్‌ను ఆమోదించిన సీఎం నవీన్

భువనేశ్వర్:

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన కొత్త సంవత్సరం కానుకగా శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి భువనేశ్వర్ మెట్రో మొదటి దశ స్థితిని సమీక్షించిన సందర్భంగా ఈ విషయం వెల్లడైంది. ఈ ప్రాజెక్ట్ వ్యయ అంచనా రూ.5929 కోట్లు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదించారు. ఈ వ్యయ భారం సమగ్రంగా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. 5టీ కార్యక్రమం కింద ఈ ఏడాది చేపట్టే భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం ఇటీవల ఆమోదం పొందిన అనుబంధ బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.210 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ భువనేశ్వర్ మెట్రో రైల్ కార్పొరేషన్ కంపెనీల చట్టం కింద విలీనమై పనులు చేపడుతుంది. ఈ ప్రాజెక్టు పురోగతి వేగవంతం చేయడంలో చేపడుతున్న కార్యకలాపాలను రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనుగర్గ్ ఆధ్వర్యంలో అనుబంధ యంత్రాంగం అనుక్షణం సమీక్షిస్తుంది.

విమానాశ్రయం వరకు

త్రిసూలియా స్క్వేర్ నుంచి భువనేశ్వర్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు లైను మార్గం నిర్మితమవుతుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య 20 స్టేషన్లతో ఈ ప్రాజెక్టు పనులు కొనసాగనున్నాయి. నందకానన్, కిట్ స్క్వేర్, డొమొన స్క్వేర్, జయదేవ్ విహార్, వాణీ విహార్, రామ్ మందిర్, భువనేశ్వర్ రైల్వేస్టేషన్, బాపూజీ నగర్, శిశు భవన్ మరియు క్యాపిటల్ ఆస్పత్రి వంటి ముఖ్యమైన ప్రదేశాల్లో స్టేషన్లు ఏర్పాటు అవుతాయి.

త్వరలో ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టు పనులను 48 నెలల్లో పూర్తి చేయాలని కాల పరిమితి నిర్ధారించారు. ఈ రంగంలో అన్ని ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాష్ట్ర చరిత్రలో మైలురాయి

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్ట్ ఒడిశా రాష్ట్ర చరిత్రలో ప్రధాన మైలురాయిగా నిలవనుంది. భువనేశ్వర్ మెట్రో రైలు వ్యవస్థతో దేశంలోని ప్రముఖ నగరాల ఎంపిక సమూహంలో చేరనుంది. ఈ ప్రాజెక్ట్ నగరంలో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేస్తుంది. నగరం ఆర్థిక వృద్ధికి వీలు కల్పిస్తుంది. నగరం వివిధ పట్టణ ప్రాజెక్టులకు గుర్తింపు పొందింది. మెరుగైన నగర జీవన నాణ్యత కలిగిన ప్రదేశంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మెగా ప్రాజెక్ట్ భువనేశ్వర్‌ను దేశంలోనే అగ్రగామి నగరంగా మారుస్తుందని నమ్ముతున్నానని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ప్రధాన రహదారుల రద్దీని తగ్గించడానికి మరియు గరిష్ట సంఖ్యలో రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ ప్రాజెక్టు ఎంపిక చేయబడిందని ముఖ్యమంత్రి (5టీ) కార్యదర్శి వీకే పాండియన్ తెలిపారు. సమావేశంలో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఉషా దేవి, రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనుగర్గ్, నగర అభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మత్తివత్తనన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు సరికాదు



ఆందోళన నిర్వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు

జయపురం: పత్రికా స్వేచ్ఛను అణిచివేస్తూ కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు నమోదు చేయడం సరికాదని కమ్యూనిస్టు పార్టీ నేతలు అన్నారు. జర్నలిస్టులపై దేశద్రోహం కేసులను వ్యతిరేకిస్తూ జయపురం ప్రధాన కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుదిష్టర్ రౌళో నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రౌళో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మీడియా గొంతును నొక్కివేయాలని చూస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నవారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కాదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం అత్యవసర పరిస్థితి కన్నా అతి భయంకర పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలపై సైతం ఇలాగే ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయిస్తూ, అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలు సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో రామకృష్ణ దాస్, సత్యబ్రత నందో, ఉమా శతపతి, అలేఖ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పొందడం ప్రజల హక్కు



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

- ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

జయపురం: ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పొందడం ప్రజల హక్కు అని, అందువలన అర్హులైన ప్రతి ఒక్కరికీ అధికారులు సంక్షేమ పథకాలు అందజేయాలని ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి సూచించారు. స్థానిక సమితి కార్యాలయ ప్రాంగణంలో 933 మందికి కొత్త పింఛన్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్లు మంజూరు కోసం ఎవరికీ ఎటువంటి డబ్బులు ఇవ్వవద్దని లబ్ధిదారులకు సూచించారు. బీడీవో రాజీవ్ దాస్ మాట్లాడుతూ.. జయపురం సమితిలో గోపబంధు పెన్షన్ యోజనలో 933 మంది కొత్త లబ్ధిదారులను చేర్చడం జరిగిందని వెల్లడించారు. వారిలో 12 గ్రామ పంచాయతీల్లో కొత్త లబ్ధిదారులైన 460 మందికి మొదటిసారి పింఛన్లు అందజేసినట్లు తెలియజేశారు. పింఛన్లు పొందినవారిలో బరిణిపుట్ పంచాయతీలో 52 మంది, ఉమ్మిరిలో 32 మంది, గొడొపాదర్‌లో 32 మంది, టంరువాలో 52 మంది, డొంగర చించిలో 21 మంది, బలియలో 42 మంది, ఎకంబాలో 32 మంది, రొండాపల్లిలో 12 మంది, రిణీగడలో 60 మంది, కేవిడిలో 11 మంది, జయంతిగిరిలో 85 మంది, పూజారిపుట్ గ్రామ పంచాయితీలో 13 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అనంతరం జాముండ పంచాయతీ కార్యాలయంలో 184 మందికి, పంపునీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 289 మందికి పింఛన్లు అందజేసినట్లు వెల్లడించారు. జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు బీడీవో మనోజ్ కుమార్ నాయిక్, సమితి సామాజిక సంక్షేమ అధికారి కె.ఎస్.నిశా, జిల్లా పరిషత్ సభ్యులు తొపతి పట్నాయిక్, అస్థ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

‘పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి’



పెన్షన్‌దారుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: పెన్షన్‌దారుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని కొరాపుట్ జిల్లా పెన్షన్‌దారుల అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ రథ్ కోరారు. స్థానిక యాదవ భవనంలో జిల్లా పెన్షన్‌దారుల అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సమస్యలపై రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలను కలవడం జరిగిందని వెల్లడించారు. పెన్షన్‌దారులకు నెలకు కనీసం రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని, బిజూ ఆరోగ్య పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు గత సెప్టెంబర్ 15వ తేదీన న్యూఢిల్లీ జంతర్‌మంతర్‌లో 22 లక్షల మంది పెన్షన్‌దారులు ఆందోళన జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదివారం చెన్నైలో సర్వ భారతీయ పెన్షన్‌దారుల అసోసియేషన్ కమిటీ సమావేశం జరిపిందని తెలిపారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు భవిష్యత్తులో ఆందోళనలు తీవ్రరూపంలో చేపట్టేందుకు సమావేశంలో చర్చించారు. నవంబర్ 16వ తేదీన దేశవ్యాప్తంగా ప్రతీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు జరిపి వినతి పత్రం సమర్పించడం ఆనవాయితీ అని, దీనిలో భాగంగా వచ్చే నవంబర్ 16న నిర్వహించనున్న ఆందోళనలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రమోద్ కుమార్ మహంతి, వైజయంతి పండ, రంజనీ సాహు, కిశోర్‌చంద్ర పండ, ఉమాకాంత రథ్, సీహెచ్ రామేశ్వర పట్నాయక్, జి.గోపాలరావు, పి.గౌరీశంకరరావు, కిశోర్ పండ తదితరులు పాల్గొన్నారు.

‘నిధుల మంజూరు ఎన్నికల స్టంట్’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

జయపురం: రాష్ట్ర స్వతంత్ర అభివృద్ధి పరిషత్‌కు ప్రభుత్వం రూ.175.5 కోట్లు మంజూరు చేయడంపై జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి విమర్శలు గుప్పించారు. అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగినదే అయినా, ఇది కేవలం ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన పెస చట్టాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెస చట్టం అమలు చేస్తే ఆదివాసీలు అభివృద్ధి చెందడంతో పాటు సురక్షితంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కొరాపుట్ జిల్లాలో ఖనిజ సంపద అంతా అమ్మివేస్తున్నారని, 10 ఏళ్ల తర్వాత జిల్లాలో ఏమీ మిగలదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే ఆదివాసీ ప్రజలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెస చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదివాసీలపై పాలకులకు అభిమానం ఉంటే గ్రామాల్లో వరదలై పారుతున్న నాటుసారాను బంద్ చేయాలన్నారు. 2018–19లో స్వతంత్ర అభివృద్ధి పరిషత్ ప్రారంభమైందని, ఎన్నికలు తర్వాత నేటి వరకు ఆ పరిషత్‌కు కార్యాలయం లేదని దుయ్యబట్టారు. అవిభక్త కొరాపుట్ జిల్లా షెడ్యూల్డ్ ప్రాంతం కావడంతో ఇక్కడి ఆదివాసీ పిల్లలకు ఉపాధ్యాయులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్నికలకు ముందు స్వతంత్ర అభివృద్ధి పరిషత్‌కు నిధులు మంజూరు చేసి, ఆదివాసీలను మరలా మోసం చేసేందుకు చూస్తున్నారని దుయ్యబట్టారు. ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో అవిభక్త కొరాపుట్‌లో 14 ఎమ్మెల్యే స్థానాలతో పాటు 2 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ విజయ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బస్సుల సమ్మె వాయిదా

- ఈనెల 31 వరకు తాత్కాలిక వాయిదా
- లక్ష్మీ బస్సు సేవల ప్రారంభానికి మార్గం సుగమం



లక్ష్మీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, మేనేజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: లక్ష్మీ బస్సు పథకానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు నిర్వహించాలని తలపెట్టిన ప్రైవేటు బస్సుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. అఖిల ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సుల నిరవధిక సమ్మె ప్రారంభం కావలసి ఉంది. అయితే ప్రస్తుతానికి ఆందోళన తాత్కాలికంగా వాయిదా పడింది.

చర్చలు సఫలం

రాష్ట్ర ప్రభుత్వ వర్గాలతో చర్చలు సఫలం కావడంతో ఈ మేరకు నిర్ణయించినట్లు అఖిల ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవేంద్ర సాహు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు బస్సుల నిరవధిక సమ్మె హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం పిలుపు మేరకు అధికారులతో సోమవారం సమావేశమై ఆందోళనకారుల వర్గం ప్రముఖులు చర్చించినట్లు వివరించారు. ప్రాథమిక చర్చల ప్రకారం ఈనెల 31వ తేదీ వరకు నిరవధిక సమ్మెని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. స్టీరింగ్ కమిటీ సమావేశం తర్వాత ప్రతిపాదిత సమ్మెపై తదుపరి కార్యాచరణతో తుది నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయం వర్గం అధికారుల భేటీలో సానుకూల ఫలితాలు వచ్చాయి. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల డిమాండ్లను పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. తమ డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక హామీని కోరుతున్నట్లు దేవేంద్ర సాహు తెలిపారు. ప్రస్తుతానికి, ఆందోళన ప్రణాళిక నిలుస్తుందని, మొత్తం సమస్యను స్టీరింగ్ కమిటీలో చర్చించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

ఇదీ విషయం

లొకేషన్ యాక్ససబుల్ మల్టీమోడల్ ఇనీషియేటివ్(లక్ష్మీ) కింద రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సరసమైన రవాణాను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ప్రైవేటు బస్సు యజమానుల్లో రాష్ట్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమయ్యింది. లక్ష్మీ కార్యక్రమం కింద ప్రైవేటు బస్సులను గ్రామీణ ప్రాంతాల్లో నడపడానికి అనుమతించాలని అఖిల ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం సభ్యులు గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రభుత్వం సంకల్పించిన లక్ష్మీ బస్సు పథకం కింద సమగ్రంగా 1,600 బస్సులను రంగంలోకి దింపేందుకు నిర్ణయించింది. వీటిలో 1,000 బస్సులు పంచాయతీ నుంచి మండలాలకు, 600 బస్సులు మండలాల నుంచి జిల్లా ప్రధాన కార్యాలయం వైపు రవాణా అవుతాయి. మండల ప్రధాన కార్యాలయం ప్రాంతం నుంచి పట్టణ, నగర ప్రాంతాల వైపు రవాణా అయ్యే 600 బస్సులు ప్రైవేటు యాజమాన్యాలకు అనుమతి మంజూరు చేయాలనేది ప్రధాన డిమాండ్.

సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మీ పథకానికి వ్యతిరేకంగా ప్రైవేట్ బస్సు యజమానులు పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త సమ్మెకు రాష్ట్ర కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. పథకంపై ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఓట్ల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకు ఎన్నికలు సమీపించినప్పుడల్లా పలు పథకాలను ప్రకటించడం ముఖ్యమంత్రికి అలవాటని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సాధారణ ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బస్సు యజమానులతో పాటు, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, జీఆర్ఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు పలువురు తమ డిమాండ్లపై నిరసనలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారి ప్రయోజనాలను పట్టించుకోవడంలో విఫలమైందని దుయ్యబట్టారు. లక్ష్మీ పథకం ప్రవేశం పురస్కరించుకుని ఇతర రాష్ట్రాల్లో అనుబంధ ప్రాజెక్టుల స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాల్సిందన్నారు.

కుగ్రామాల నుంచి రాజధానికి అనుసంధానం

పంచాయతీల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లా ప్రధాన కార్యాలయాలకు మరియు జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి బస్సులను నడపడానికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీ పథకాన్ని సంకల్పించడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గాంధీ జయంతి పురస్కరించుకుని ఈనెల 2వ తేదీన అవిభాజ్య కొరాపుట్ జిల్లా పరిధిలో లక్ష్మి తొలి దశ కార్యాచరణ ప్రారంభించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మంది ప్రైవేట్ బస్సు యజమానులు మరియు 14 వేల మంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల ఆదాయాన్ని లక్ష్మీ పథకం ప్రభావితం చేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు.

తొలగిన అడ్డంకులు

అఖిల ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం మంగళవారం పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె వాయిదా ప్రభుత్వానికి అనుకూలించింది. దీంతో ఈనెల 12వ తేదీన మల్కన్‌గిరి జిల్లాలో ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష్మీ బస్సు రవాణా ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. నిరవధిక సమ్మె వాయిదా పడడంతో ఈ కార్యక్రమానికి అడ్డంకి తొలగింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మల్కన్‌గిరి జిల్లాలో లక్ష్మీ బస్సుల సేవలను ప్రారంభించాల్సి ఉంది.

ఈనెల 12న ప్రారంభం

ఈనెల 12న లక్ష్మీ బస్సు సేవలను మల్కన్‌గిరి నుంచి ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు అయింది. ఆ రోజున ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ సేవలను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ఖారవేళ భవన్‌లో లక్ష్మీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, మేనేజర్లకు తర్ఫీదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ వీరందరికి ప్రత్యేక సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని బస్సు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మల్కన్‌గిరి, నవరంగపూర్, కొరాపుట్, రాయగడ, గజపతి మరియు కందమల్ సహా 6 దక్షిణాది జిల్లాల్లో లక్ష్మీ పథకం కింద బస్సు సేవలు మొదటి దశలో ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

అగ్గి పుల్లలతో పోస్టు బాక్స్



ఈ చిత్రంలో కనిపిస్తున్న పోస్టుబాక్సు 412 అగ్గి పుల్లలతో రూపుదిద్దుకుంది. ఈనెల 10వ తేదీన జాతీయ పోస్టు బాక్సుల దినోత్సవం పురస్కరించుకుని పూరీ కుంభార్‌పడాలో ఉంటున్న శాస్వత రంజన్ సాహు సృజనాత్మకంగా ఈ కళాకృతిని ఆవిష్కరించడం విశేషం. 8 గంటలపాటు నిర్విరామంగా శ్రమించి దీనిని తయారు చేసినట్లు వివరించాడు.

– భువనేశ్వర్

అంతర్ క్లబ్ రోలర్ స్కేటింగ్ పోటీలు

భువనేశ్వర్: స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) క్యాంపస్‌లో ప్రథమ అఖిల ఒడిశా ఇంటర్ క్లబ్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం నిర్వహించారు. స్కేటింగ్ క్రీడని ప్రోత్సహించే దృక్పథంతో రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక స్కేటర్లను ఒకే ప్రాంగణంలో పోటీ కోసం వేదిక ఏర్పాటు చేసినట్లు ఐఐటీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని వివిధ క్లబ్‌ల నుంచి 200 మందికి పైగా స్కేటర్లు ఈ ఛాంపియన్ షిప్‌లో పోటీ పడ్డారు. పోటీ 4 విభాగాల్లో నిర్వహించారు. బిగినర్స్, ఫ్యాన్సీ ఇన్‌లైన్, ప్రొఫెషనల్ క్వాడ్, ప్రొఫెషనల్ ఇన్‌లైన్ వర్గాలుగా 6 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు వయస్సు స్కేటర్లని విభజించి పోటీకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీ భువనేశ్వర్ రిజిస్ట్రార్ వామదేవ్ ఆచార్య ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న స్కేటర్లను ప్రోత్సహించారు. ఈ గేమ్‌ను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న క్లబ్‌లు మరియు నిర్వాహకులను అభినందించారు.

బస్సు నుంచి జారిపడి యువకుడి మృతి

మెంటాడ: మండలంలోని ఆంద్ర గ్రామంలో సోమవారం బస్సునుంచి జారిపడి లోతుగెడ్డ గ్రామానికి చెందిన యువకుడు బోనిశివ (25) మృతి చెందాడు. ఆంద్ర పోలీస్‌స్టేషన్ రైటర్ పైడితల్లి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివ ఆంద్ర నుంచి మెంటాడ వెళ్లే బస్సు ఎక్కి ఫుట్‌పాత్‌పై నుంచి జారిపడ్డాడు. యువకుడు రోడ్డుమీద పడగానే తలకు గాయమై తీవ్రరక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మరొకరు..

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు పామాయిల్ తోటలో పనిచేస్తున్న చిట్టిబోయిన అప్పారావు(30) విద్యుత్ మోటార్ ఆన్‌చేస్తున్న సమయంలో ప్రమాద వశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన వాడు. మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివారావు(29) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాలప్డాడు. వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయం, రాడ్‌బెండింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాస రావు ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగి 11 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో భార్య పెద్ది సబిత కాయగూరలు కొనేందుకు బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటి వచ్చి చూసేసరికి భర్త వాంతులు, విరోచనాలు చేసుకుని బాత్‌రూమ్ దగ్గర అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. పక్కనే పురుగు మందు డబ్బా ఉండడంతో అనుమానం వచ్చి వెంటనే కుటుంబసభ్యులతో విజయనగరం తిరుమల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ఆకట్టుకున్న హరికథా గానం

శృంగవరపుకోట: సంప్రదాయ బద్ధమైన సనాతన సాంస్కృతిక కళలలో ఒకటైన హరికథా గానం ప్రేక్షకులను, భక్తులను ఆకట్టుకుంది. సోమవారం సాయంత్రం పట్టణంలోని ధారగంగమ్మ ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలలో భాగంగా దేవాదాయశాఖ కె.నిర్మలా భాగవతార్ చేత రుద్రాక్ష మహిమ అనే హరికథా గానం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హరికథా భాగవతార్ కె.నిర్మల తన శ్రావ్యమైన కంఠంతో రుద్రాక్ష పుట్టుపూర్వోత్తరాలు, విశేషాలు, రుద్రాక్ష విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.



సంబల్‌పూరి నృత్య ప్రదర్శన, గ్రీష్మా ఒడిస్సీ నృత్య ప్రదర్శన



కుయి నృత్య ప్రదర్శన



డొంగిరియా తెగకు చెందిన నృత్య ప్రదర్శన

సంస్కృతిని పరిరక్షించాలి

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: భిన్న సంస్కృతులు కలిగిన రాష్ట్రం మనది అని, వాటిని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక సంస్కృతి భవనంలో జిల్లా సంస్కృతి విభాగం, జిల్లా యంత్రాంగం సంయుక్తం నువాఖాయ్‌భేట్-ఘాట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ.. ఇదివరకు నువాఖాయి పశ్చిమ ఒడిశా ప్రాంత ప్రజలు మాత్రమే పండగను జరుపుకునేవారని, అయితే ఈ పండగ ప్రాముఖ్యతను దృష్టి పెట్టుకుని గత మూడేళ్లుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పండగ జరుపుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలియజేశారు. అన్ని భాషలు, సంస్కృతులు, కళలను ఆదరించాలన్న భావంతో ఈ కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గౌరవ అతిథులుగా ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్, డీకే మహంతి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్‌లు హాజరయ్యారు. అనంతరం కుయి, ఆదివాసీ, డొంగిరియా సాంప్రదాయాలకు చెందిన నృత్యాలను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న మంత్రి సరక, వేదికపై సరస్వతి, అనసూయ మాఝి తదితరులు

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ పథకం విస్తరణ

- సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో మరో 13 నగరాలు మరియు 5 పట్టణ ప్రాంతాలకు డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ పథకం విస్తరించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా ఈ పథకాన్ని విస్తరింపజేశారు. ఐదు పట్టణాలు మరియు 13 నగర ప్రాంతాలు, 149 వార్డుల్లో రాత్రింబవళ్లు కుళాయి తాగునీరు పథకంలో భాగమైన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయ్‌రంగ్‌పూర్, బీరమిత్ర పూర్, రాజ్‌గంగ్‌పూర్, చంపువా, నిమ్మపడా పట్టణ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు 'డ్రింక్ ఫ్రమ్ ట్యాప్' సౌకర్యం అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదనంగా, బరంపురం (37), భువనేశ్వర్ (27), కటక్ (21), రౌర్కెలా (20), సుందర్‌గడ్ (17), వ్యాస నగర్ (6), ఖుర్దా (4), జట్నీ (3), హింజిలి (3), బొడొబిలా (2), మరియు జోడా, కెంజొహర్ మరియు ఆనంద్‌పూర్‌లో ఒక్కో వార్డుకు ఒక్కొక్కరికీ డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ సౌకర్యం లభిస్తుంది. ఈ విడత విస్తరణతో ఆయా ప్రాంతాల్లో దాదాపు 12.3 లక్షల మంది లబ్ధి పొందుతారని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. 5టీ మోడల్ గవర్నెన్స్ కింద 2020 సంవత్సరంలో సుజల్ - డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ కార్యక్రమం భువనేశ్వర్ మరియు పూరీ ప్రాంతాల్లో తొలుత ప్రారంభించారు. దీంతో తొలి విడత కింద 1.8 లక్షల మంది లబ్ధి పొందారు. అంచెలంచెలుగా రాష్ట్రంలో పలు పట్టణ, నగర ప్రాంతాల్లో 15 లక్షల మందికిపైగా పట్టణ ప్రాంతీయులకు ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. 2021 సంవత్సరంలో పూరీ పట్టణంలో తొలిసారిగా డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో గోపాల్‌పూర్ రెండవ నగరంగా నిలిచింది. ఈ ప్రాంతాల్లో 100 శాతం మంది ప్రజలు డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ వ్యవస్థ సదుపాయం పొందుతున్నారు. 2022 సంవత్సరం డిసెంబర్ నెలలో రాష్ట్రంలోని 19 నగరాలు మరియు పట్టణాల్లో డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ వ్యవస్థని ప్రవేశపెట్టారు. ఈ ప్రాంతాల్లో 5.55 లక్షల మందికి కుళాయిల ద్వారా 24 గంటలూ తాగునీరు సరఫరా చేయబడింది.



వర్చువల్‌గా డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

త్వరలో దహన సంస్కారాలు

- సీబీఐ రాక కోసం నిరీక్షణ

భువనేశ్వర్: బహనాగా బజారు ట్రిపుల్ రైలు దుర్ఘటనలో హక్కుదారులు లేని 28 మంది మృతదేహాలను శాస్త్రీయ దహన సంస్కారాలతో మోక్షం కల్పించేందుకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక మార్గదర్శకాలు జారీ అయిన విషయం తెలిసిందే. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ బృందం రెండు రోజుల్లో ఇక్కడికి చేరుకుంటుందని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్ విజయ్ అమృత కులంగే సోమవారం తెలిపారు. సీబీఐ అధికారులు నగరానికి రాగానే ప్రక్రియ ప్రారంభిస్తారు. వారి సమక్షంలో మృత దేహాలను అప్పగించి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నగరంలో భరత్‌పూర్, సత్య నగర్‌తో పాటు ఇతర శ్మశాన వాటికల్లో అంత్యక్రియలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం భువనేశ్వర్ ఎయిమ్స్‌లో భద్రపరిచిన మృతదేహాల దహన సంస్కారాల కోసం సిద్ధం చేయాలని ఖుర్దా జిల్లా యంత్రాంగం ఎయిమ్స్‌కి లేఖ రాసింది. సీబీఐ నుంచి అనుమతి పొందిన తర్వాత ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న బీఎంసీ కమిషనర్ విజయ్ అమృత కులంగే

సీబీఐ సమక్షంలో...

శాస్త్రీయ రీతులతో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాలను మాకు అప్పగించాలని ఎయిమ్స్-భువనేశ్వర్ అధికారులను అభ్యర్థించారు. మృతదేహాల అప్పగింతలు, దహన సంస్కారాల సమయంలో హాజరు కావాలని సీబీఐకి లేఖ రాశారు. వారి నుంచి తదుపరి క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నామని బీఎంసీ కమిషనర్ విజయ్ అమృత కులంగే తెలిపారు. సీబీఐ అధికారుల సమక్షంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉందని మేయర్ దాస్ తెలిపారు.

గొర్రెలు, కోళ్లు చోరీ

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామానికి సమీపంలో కళ్లంలోని షెడ్‌లో ఉంచి రూ.50 వేల విలువైన రెండు గొర్రిపోతులు, రెండు కోడిపుంజులను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారని గ్రామానికి చెందిన బొడ్డు స్వామినాయుడు తెలిపాడు. రాబోయే విజయదశమికి మూడు గొర్రిపోతులు, రెండు కోడిపుంజులను కొని మేపుతున్నానని, కళ్లంలో గల ఒక షెడ్‌లో వాటిని పెట్టి తాళాలు వేసి ఇంటికి వచ్చానని, తెలవారు జామున వెళ్లి చూసుకునేసరికి షెడ్ తాళాలు విరగ్గొగొట్టి రెండు గొర్రెపోతులు, రెండు కోడిపుంజులను ఎత్తుకుపోయినట్లు వాపోయాడు. ఈ మేరకు ఎల్.కోట పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

అండర్-19 స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో సత్తా చాటాలని సెట్విజ్ సీఈఓ బి.రామ గోపాల్ ఆకాంక్షించారు. అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరుకాగా..ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5గురు బాలురు, 5గురు బాలికలు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న అండర్-19 బాల, బాలికల అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు సీఈఓ రామగోపాల్ తెలిపారు. ఎంపిక పోటీలను అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి పొట్నూరు శ్రీరాములు పర్యవేక్షించారు.



బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ క్రీడాకారులు

11న హాకీ, త్రోబాల్ జట్ల ఎంపిక

అండర్-19 స్కూల్‌గేమ్స్ త్రోబాల్, హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 11న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఉత్కళమణికి భారతరత్న ప్రకటించాలి

రాయగడ: స్వాతంత్ర్య సమరయోధుడు ఉత్కళమణి గోపబంధుకు భారతరత్న ప్రకటించాలని పలువురు కోరారు. ఆయన 146వ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక గాంధీ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపబంధు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పట్టణ గోపినాథ్ సాహు, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉత్కళమణి గోపబంద్ దాస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మానస్ మడ్కమి గోపబంద్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతి వేడుకలు మాతృభాషా పండితుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాతృభాషలో అనేక రచనలు చేశారని, దీంతో జయంతి దినోత్సవాన్ని సేవా దివాస్‌గా పరిగణించారని తెలియజేశారు. అనంతరం సరస్వతీ శిశు విద్యా మందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్ కుమార్ పండా నేతృత్వంలో పర్లాకిమిడి మహారాజా గోల్డెన్ జుబ్లీ కుష్టురోగుల పునరావాస కేంద్రం, ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రి, ప్రసూతి వార్డులో బాలింతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



పర్లాకిమిడి: పండిత గోపబంద్ దాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: గోపబంద్ దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మానాస్ మడ్కమి తదితరులు



రాయగడ: గోపబంధే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సరక తదితరులు

సమన్వయంతో అభివృద్ధి పనుల పూర్తి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సాలూరు నియోజకవర్గంలోని గడపగడపకు మన ప్రభుత్వం కింద ప్రాధాన్యతా క్రమంలో మంజూరైన పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూరు మున్సిపాల్టీ, మక్కువ, పాచిపెంట మండలాల గ్రామ సచివాలయం పరిధిలో మంజూరైన పనులు, వివిధ దశల్లో ఉన్న ప్రగతిని సమీక్షించారు. అనంతరం అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడానికి గల కారణాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అప్‌లోడ్ చేయని కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మరో రూ. 11కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, సాలూరు మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండగా ఉందాం

సీనియర్ సిటిజన్లకు అండగా ఉందామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం సీనియర్ సిటిజన్ల సంక్షేమంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను గౌరవించాలి. వారికి రక్షణగా నిలవాలి. వారికి అవసరమైన సదుపాయాలను కల్పించాలని ప్రజలను కోరారు. ప్రతి నెలా వారి జీవనానికి ఎలాంటి ఆటంకాలు ఉండకుండా వారికి అవసరమైన అన్ని వనరులు సమకూర్చాలని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన కేసులు, తల్లిదండ్రుల ఆస్తులు అన్యాక్రాంతం చేసిన కేసుల వివరాలు అందాయన్నారు. వాటిపై ఆర్డీఓ తక్షణ చర్యలు చేపట్టి ఆస్తులను అప్పగించినట్లు తెలిపారు. కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్లతో స్నేహపూర్వక వాతావరణం ఉండాలని హితవు పలికారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ జె. వెంకటరావు, డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి. కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ. ప్రభాకరరావు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..!

- దోచుకుంటే అడిగేదెవరు?
- మూడు పంచాయతీల నుంచి రూ 2.17 లక్షలు స్వాహా
- సంబంధిత పంచాయతీల్లో టీడీపీ సానుభూతిపరులే సర్పంచ్‌లు



లచ్చింపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

లక్కవరపుకోట: ప్రజల సొమ్మేకదా,.మా ఇష్టం వచ్చినట్లు దోచుకుంటాం. మమ్ములను అడిగేదెవరనుకున్నారు మూడు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు. ఈ నేపథ్యంలో వారంతా ఒక్కటయ్యారు. ఇదే అదునుగా పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2.17 లక్షలు స్వాహా చేశారు. లేని పోస్టును, వ్యక్తిని సృష్టించి డబ్బులు కాజేశారు. ఈ నిధులను ఆయా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీ సుంకరి వేమన, మండల పరిషత్ అధికారులు వాటాలుగా పంచుకున్నారు.ఈ విషయం బయటకు పొక్కడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు వినికిడి. ఈ స్వాహాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలంలోని లచ్చింపేట, పోతంపేట, రంగరాయపురం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఒక్కటై మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్ (ఎంఆర్‌పీ) సుంకరి వేమన భార్య ఉమ నాలుగేళ్లుగా ఆయా పంచాయతీల లావాదేవీలను నమోదు చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు నకిలీ పోస్టు సృష్టించారు. దీంతో పంచాయతీ పాలక వర్గాలు తీర్మానం చేసి నిధులను మళ్లించేశాయి. ఈ విధంగా ఈ ఏడాది మార్చి 20వ తేదీన లచ్చింపేట పంచాయతీ నుంచి రూ.82,458, పోతంపేట పంచాయతీ నుంచి రూ.48,744, గత ఏడాది మే 16వ తేదీన రంగరాయపురం పంచాయతీ నుంచి రూ.85,800 నగదు ఎస్.కోటలో గల ఆంధ్రాబ్యాంక్‌లోని ఉమ ఖాతా నంబర్ 173910100020791 కు బదిలీ చేశారు. ఆమె నాలుగు సంవత్సరాలుగా ఆయా గ్రామ పంచాయతీల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు పంచాయతీలు తీర్మానాలు చేశాయి, ఈ వ్యవహారంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంఆర్‌సీ సుంకరి వేమన ప్రధాన సూత్రధారులు. ఈ తతంగం పైకి పొక్కడంతో మిగతా సర్పంచ్‌ల్లో వణుకు మొదలైంది. మా పంచాయతీల్లో కూడా మాకు తెలియకుండా ఎంతెంత నగదు బదిలీ చేసుకున్నారో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల మళ్లింపుపై ఈఓపీఆర్‌డీ, ప్రస్తుతం ఎఫ్ఏసీ ఎంపీడీఓ జ్ఞానేశ్వర రావును వివరణ కోరగా సచివాలయంలో కంప్యూటర్ సహాయకులు వచ్చిన తరువాత 2019 అక్టోబర్-2 తేదీ నుంచి నగదు చెల్లించడం తగదన్నారు. ఈ నిధుల మళ్లింపు తన దృష్టికి వచ్చింని, పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలకు సిఫార్స్ చేస్తానని తెలిపారు.

లేని పోస్టును సృష్టించి

గత ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీల డిజిటల్ లావాదేవీలను కంప్యూటరీకరణ చేసేందుకు ప్రతి పంచాయతీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారు. వీరికి ఆయా పంచాయతీల జనాభా ప్రాతిపదికన నెలకు కొంత మొత్తం పంచాయతీ నిధుల నుంచి చెల్లించేవారు. ఈ వ్యవస్థను అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు తమ సానుభూతి పరులను నాలుగు పంచాయతీలకు ఒకరిని చొప్పున నియమించుకున్నారు. వీరి పేర్లపై బ్యాంక్ ఖాతాలను ఏర్పాటు చేసి వారికి నచ్చిన విధంగా నిధులు మళ్లించుకునేవారు.

ఈ అవినీతిని అరికట్టి, పారదర్శకమైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2019 సంవత్సరం అక్టోబర్-2 వతేదీన గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రతి సచివాలయానికి 11 మంది సిబ్బందిని నియమించి అన్ని రకాల సేవలను అందజేయడంతో పాటు డిజిటల్ సహాయకులతో పంచాయతీ లావాదేవీలను కంప్యూటరీకరణ చేయిస్తున్నారు. ఇంత జరిగినప్పటికీ గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను కొనసాగిస్తున్నట్లు పేర్కొంటూ వారికి పంచాయతీ నిధులను చెల్లించడం గమనార్హం. ఇప్పటికైనా ఈ తరహా చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

రేపు గొండు పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం ఈ నెల 11న శ్రీకాకుళం నగరంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాపూజీ కళామందిర్‌లో జరిగే బాల్య వివాహ వ్యతిరేక సదస్సు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగే సమీక్షలతో పాటు పలు పాఠశాలలను సందర్శిస్తారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి నరసన్నపేట విద్యార్థి



కె.నివాస్

నరసన్నపేట: స్థానిక పుండరీకాక్ష కాలనీకి చెందిన కె.నివాస్ జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. అక్టోబర్ 13 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. అందులో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున నివాస్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న నివాస్ ప్రస్తుతం నరసన్నపేటలో ఫుట్‌బాల్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా సైతం బాధ్యతలు నిర్వహిస్తున్నాడని కోచ్ రాకేష్ తెలిపారు.

జీడిపప్పు పరిశ్రమలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన జీడిపిక్కలను పరిశీలిస్తున్న యజమాని

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులోని శ్రీలక్ష్మి కాజూ ఇండస్ట్రీలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. పొగలు వస్తున్నాయని స్థానికులు సమాచారం అందించడంతో యజమాని సకలాభక్తుల అనిల్ వెళ్లి చూసేసరికి ఫ్యాక్టరీలో సుమారు 800 కేజీల జీడిపిక్కలు కాలిబూడిదైనట్లు గుర్తించారు. బాయిలింగ్ కోసం ఆటోమెటిక్ యంత్రంలో పెట్టి ఇంటికి వెళ్లిపోయామని, సమయానికి ఆగకపోవడంతో పిక్కలు మాడిపోయాయని యజమాని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని చెప్పారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి



తాడి జానకిరామ్ మృతదేహం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామానికి చెందిన తాడి జానకిరామ్ (55) వడదెబ్బతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడి జానకిరామ్ విజయనగరం జిల్లా పద్మానాభపురంలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో జీవిస్తున్నాడు. గతంలో ప్రమాదం జరగడంతో డ్రైవర్‌గా మానేశాడు. ప్రస్తుతం తెంబూరులో తల్లి తాడి సరస్వతి చూడడానికి ఈ నెల 2న వచ్చాడు. సోమవారం ఉదయం వెంకటాపురం సమీపంలో మధ్యాహ్నం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రిమ్స్‌లో సేవలు భేష్



డీఎంఈ నరసింహంను సత్కరిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు ఉత్తమ సేవలు అందుతున్నట్లు తమకు నివేదికల ద్వారా సమాచారం అందిందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం అన్నారు. సోమవారం పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వచ్చిన ఆయన రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఆడిటోరియంలో జరిగిన వైట్‌కోట్ సెరమనీలో పాల్గొని మాట్లాడారు. వైద్య వృత్తి ఉన్నతమైనదని, దీనిని గుర్తెరిగి వైద్య విద్యార్థులు, డాక్టర్లు ముందుకు వెళ్లాలన్నారు. క్రమశిక్షణ ముఖ్యమన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు వైట్‌కోట్లు అందించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం డీఎంఈని వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ పార్వతి, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సర్టిఫికెట్లు వచ్చేశాయ్!



కొయ్యాం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కె.తవిటినాయుడు, లెక్చరర్లు

- విద్యార్థులకు అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు
- 'డిజీలాకర్' యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు



ఇంటర్ ఒరిజినల్ మార్క్స్ మెమోలు/పాస్ సర్టిఫికెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఒరిజినల్(పాస్) సర్టిఫికెట్లు ఎట్టకేలకు విద్యార్థులకు చెంతకు చేరుతున్నాయి. ఇప్పటికే జూనియర్ కాలేజీలకు చేరిన ఇంటర్మీడియెట్ మార్క్స్ మెమోలను పకడ్బందీగా అందజేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వివిధ కారణాలతో పంపిణీలో కాస్త జాప్యం జరిగినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి విద్యార్థులకు త్వరితగతిన చేరేలా చొరవ తీసుకున్నారు. మొత్తంమీద తమకు పాస్ సర్టిఫికెట్లు అందించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

విద్యార్థులతో కళకళ..

పాస్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కళాశాలలు కళకళలాడుతున్నాయి. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈ ఏడాది మార్చి 15 నుంచి నెలాఖరు వరకు పబ్లిక్ పరీక్షలు జరిగాయి. అనంతరం సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి నెలాఖరు వరకు నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులతోపాటు గతంలో ఫెయిలైన విద్యార్థులు కలిసి 39410 మంది పరీక్షలు రాశారు. ఇందులో 20650 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిందరి మార్క్స్ మెమోలు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి వెనువెంటనే కాలేజీలకు చేరేలా డీవీఈవో కోట ప్రకాశరావు నేతృత్వంలో ఆర్‌ఐఓ పి.దుర్గారావు, సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. కాలేజీలకు హాజరవుతున్న విద్యార్థులకు డిజీలాకర్ యాప్‌పై ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌లో అన్ని సర్టిఫికెట్లు లభ్యమౌతున్నాయని తెలియజేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 191 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 168. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్‌స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్ స్కూల్ కాలేజీలు 5, కోపరేటివ్ 2, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 73 ఉన్నాయి. వీటిల్లో ప్రథమ ద్వితీయ సంవత్సరం కలిపి 49490 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అన్ని కాలేజీలకు చేరవేశాం..



ఇంటర్మీడియెట్ పాస్ సర్టిఫికెట్లు(మార్క్స్ మెమోలు) జిల్లాకు చేరిన వెంటనే కాలేజీలకు అందజేసేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు త్వరితగతిన పంపిణీ చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది, అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు సమాచారం అందించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలా ఆదేశించాం.

– పి.దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్‌ఐఓ, శ్రీకాకుళం జిల్లా

'డిజీలాకర్'పై అవగాహన..



ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్ల అందజేసే ప్రక్రియ వాయువేగంతో సాగుతోంది. డిజీలాకర్ యాప్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇన్‌స్టాల్ మొదలు పనిచేసే విధానంపై ఇప్పటికే ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించాం. విద్యార్థులతోపాటు సామాన్యులకు సైతం చాలా ఉపయుక్తమైన యాప్ డిజీలాకర్.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య, శ్రీకాకుళం డీవీఈవో

కాన్షీరాం సేవలు చిరస్మరణీయం



కాన్షీరాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవతావాది, దళిత-బహుజనుల హక్కుల సాధనకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలను ఐక్యం చేసి బహుజనుల రాజ్యాధికారానికి కృషి చేసిన మహోన్నత శక్తి కాన్షీరాం అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో కాన్షీరాం విగ్రహానికి బహుజనులు, బీసీ, దళిత నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ, దళిత సంఘాల నాయకులు కల్లేపల్లి రామ్‌గోపాల్, జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు, తెక్కెల్యాండో శ్రీను, కంత వేణు, బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బి.వి.రమణ, పిట్టా హేమసుందర్, బీన ఢిల్లీరావు, ఎల్.అనంతరావు, గుణుపూరు నరసింగరావు, బోడల రాజారావు, లింగాల గరికివాడు, లాస సోమేశ్వరరావు, అర్జి ఈశ్వర్, అదపాక రాంబాబు, రంగాజీదేవ్, నాగరాజు, పేరూరి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కో ఆర్డినేటర్ గుంట మంజులాదేవి, నక్క అప్పలరాజు, లండ అప్పన్న పాల్గొన్నారు.

● వైభవంగా కూర్మనాథుని శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గార : విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి శోభాయత్ర వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. లంకపేట జానకిరామ కోలాటం, ఇప్పిలి భజనబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గోకర్ణపల్లికి చెందిన ఆర్.మీనాక్షి హరికథా గానం అలరించింది. ఈవో జి.గురునాధం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు పూడి కమల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



జన్ని అశ్విని(ఫైల్)

మెళియాపుట్టి: పెళ్లయిన ఆరు నెలలకే వివాహిత మృతి చెందిన సంఘటన మెళియాపుట్టి మండలంలోని ముకుందాపురం పంచాయతీ పరశురాంపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పరశురాంపురం గ్రామానికి చెందిన జన్ని కృష్ణారావుతో పాగడవెల్లి గ్రామానికి చెందిన జన్ని అశ్విని (21) మార్చిలో వివాహం జరిగింది. అశ్విని సోమవారం మధ్యాహ్నం బహిర్భూమికని గ్రామశివారు ప్రాంతానికి వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన తర్వాత నోటి నుంచి నురగలు కక్కుతూ, మాట్లాడలేని స్థితిలో ఉండటంతో వెంటనే కుటుంబసభ్యులు ఆటోలో మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బయలుదేరారు. ఆస్పత్రికి చేరేలోపే మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించనున్నట్లు తెలిసింది.

బారువకొత్తూరులో ఇల్లు దగ్ధం

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరులో సోమవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పిట్ట సూర్యనారాయణకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో డ్వాక్రా రుణం రూ.లక్ష నగదు, టైలరింగ్ కోసం గ్రామస్తులు ఇచ్చిన సుమారు రూ.50 వేలు విలువైన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ. మూడులక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

నవ్య కేసులో నలుగురు అరెస్టు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్ మొదటి వీధిలో వరకట్న వేధింపులు తట్టుకోలేక అనుమానాస్పదంగా మృతి చెందిన పొడుగు నవ్య కేసులో సోమవారం సాయంత్రం నలుగురిని డీఎస్పీ అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ ప్రసాదరావు తెలిపారు. నవ్య భర్త పొడుగు సంతోష్, అత్త హేమలత, ఆడపడుచులు కొత్తకోట మాధవి, జామి లక్ష్మి(మానస)లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ వై.సింహాచలం వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న 28 వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో 12, ఆమదాలవలసలో 2, పలాస-కాశీబుగ్గలో 10, ఇచ్ఛాపురంలో 4 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, వార్డుకు చెందిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 30వలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాల పంట

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో కెన్యూరియో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రని, కటా, కుమిటీ విభాగాల్లో ఎనిమిది పతకాలు కై వసం చేసుకున్నట్లు కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు తెలిపారు. అందులో 2 స్వర్ణం, 2 రజతం, 4 కాంస్య పతకాలు ఉన్నట్లు చెప్పారు. విజేతలకు ఏపీ కరాటే చీఫ్ కె.సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ రెడ్డి ఢిల్లేశ్వరరావును శ్రీ చైతన్య కళాశాల యాజమాన్య ప్రతినిధులు సోమవారం అభినందించారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో శ్రీకాకుళం జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్కూల్‌గేమ్స్ వాలీబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు వేదికగా ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో అద్భుతమైన ఆటతీరుతో రాణించిన ఎ.తోషన్‌రామ్ (ఏపీ మోడల్ స్కూల్ పాతపట్నం), ఎ.ప్రేమ్‌కుమార్ (ఆర్‌సీఎం స్కూల్ వంగర) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా జట్టు ప్రదర్శన పట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.వి.రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కె.రామచంద్రుడు, వై.పోలినాయుడు, ఎన్వీ రమణ, సతీష్‌కుమార్, పీడీలు సంతోషం వ్యక్తంచేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో పొందూరు యువకుడికి స్వర్ణం




పతకం అందుకుంటున్న రాజశేఖర్

పొందూరు: నేపాల్‌లో ఈ నెల 5 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పొందూరుకు చెందిన గంటా రాజశేఖర్ సత్తాచాటారు. సీనియర్ విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని కై వసం చేసుకున్నాడు. రాజశేఖర్ తండ్రి శ్రీనివాసరావు, తల్లి పార్వతి సాధారణ కూలీలుగా పనిచేస్తున్నారు. పొందూరులోనే శిక్షణ తీసుకున్న రాజశేఖర్ అంతర్జాతీయ పోటీలలో రాణిస్తుండటంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

22న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్/సోంపేట: ఉద్దాన ప్రాంతంలోని సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామంలో ఈ నెల 22న 'వే టూ సక్సెస్' గ్రూప్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు చిడిపల్లి దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే వారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. అసక్తి గల వారు 94903 88708 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు



ట్రాఫిక్ మళ్లింపు రూట్ మ్యాప్



ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని డే అండ్ నైట్ కూడలిలో అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 11 నుంచి ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు రోడ్ల కూడలి నుంచి కృష్ణా పార్కు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యే వరకు వాహనచోదకులు సహకరించాలని కోరారు.

రూట్-1 : ఏడు రోడ్ల కూడలి నుంచి కృష్ణాపార్కు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లదలిచిన వాహనచోదకులు(కారు, ఆటో, బైకులు) డే అండ్ నైట్ వద్ద ఎడమ వైపునకు తిరిగి సింధూర కూడలి మీదుగా సింధూర ఆసుపత్రి, ఆర్ట్స్ కళాశాల రోడ్డు – అంబేడ్కర్ కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు వైపుకు వెళ్లాలి.

రూట్-2 : ఎన్‌హెచ్-16 ఆర్చి కూడలి, కిమ్స్ ఆస్పత్రి మీదుగా టౌన్‌లోకి వచ్చే వాహనచోదకులు(కారు, ఆటో, బైకులు) సింధూర కూడలి వద్ద ఎడమ వైపునకు తిరిగి సింధూర ఆసుపత్రి, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, అంబేద్కర్ కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లవచ్చు.

రూట్ -3: ఆర్టీసీ కాంప్లెక్సు వైపు నుంచి అంబేద్కర్ కూడలి మీదుగా ఏడురోడ్ల కూడలి వైపు వెళ్లదల్చిన వాహనచోదకులు (కారు, ఆటో, బైక్‌లు) డేఅండ్ నైట్ కూడలి మీదుగా ఏడురోడ్ల కూడలి వైపు వెళ్లవచ్చు.

- విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఎన్‌హెచ్-16 ఆర్చి కూడలి వైపు నుంచి రాకుండా కొత్తరోడ్డు – బలగ కూడలి – రిమ్స్ ఆస్పత్రి కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు చేరుకోవాలి.
- శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి విశాఖపట్నం, విజయనగరం వైపు వెళ్లదల్చిన ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు డేఅండ్‌నైట్ కూడలి వైపు రాకుండా రిమ్స్ ఆసుపత్రి కూడలి మీదుగా బలగ కూడలి– కొత్తరోడ్డు – ఎన్‌హెచ్-16కు వెళ్లాలి.
- ఆర్టీసీ కాంప్లెక్సు వైపు నుంచి ఏడు రోడ్ల కూడలి వైపు, ఓబీఎస్ (పాతబస్టాండు) నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వైపు రాకపోకలకు బస్సులకు అనుమతి లేదు.

15న ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈ నెల 15న నిర్వహిస్తున్న లలిత హోండా ఓపెన్ పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రామలక్ష్మణ రోడ్డులోని లలిత హోండా షోరూం ఎండీ ఆకుల ప్రదీప్, మేనేజింగ్ పార్టనర్ జి.భీమారావుల స్పాన్సర్‌షిప్‌తో నిర్వహిస్తున్న మెన్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌పై మక్కువ కలిగిన వారు ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వయసుతో సంబంధం లేదన్నారు. కేవలం డబుల్స్ విభాగంలో పురుషులకు మాత్రమే పోటీలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విజేతలకు రూ.20వేల నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోగా 94402 55255 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ రుసుం రూ.500గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో సంపతిరావు సూరిబాబు, జిల్లా కోశాధికారి గోర అనిల్‌కుమార్, కోచ్ కిల్లి ఢిల్లేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్‌లు కె.సాయికుమార్, కె.క్రాంతి తదతరులు పాల్గొన్నారు.

● నేటి నుంచి సాగర్ కవచ్



సిబ్బంది సూచనలిస్తున్న సీఐ గోవిందరావు

గార: తీర ప్రాంత చొరబాట్లను నిరోధించేందుకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు సాగర్ కవచ్ నిర్వహిస్తున్నామని కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, రణస్థలం, పోలాకి తదితర మండలాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద మెరైన్ సిబ్బంది పహారా కాస్తారని చెప్పారు. రోడ్డు మార్గంలో సివిల్ పోలీసులు, సముద్రంలో కోస్టు గార్డు పహారా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

చిక్కిన 'చిన్ని కృష్ణుడు'

- మార్కెటింగ్‌శాఖ నిధుల స్వాహాలో కీలక పాత్రధారి చిన్ని కృష్ణ అరెస్ట్
- ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం 'కమిటీల్లో' నిధులు పక్కదారి
- బొక్కేసిన నిధులు మూడు కోట్ల పైమాటేనని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి
- విశాఖలో అదుపులోకి తీసుకున్న జేఆర్ పురం సర్కిల్ పోలీసులు
- సోమవారం అరెస్టు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లానే కాదు రాష్ట్ర సహకార శాఖను కుదిపేసిన మార్కెటింగ్ కమిటీ నిధులు అక్రమ వ్యవహారంలో కీలక సూత్రధారి, గతంలో కార్యదర్శిగా పనిచేసి ఎస్.చిన్నికృష్ణను జేఆర్ పురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీల్లో సెక్రటరీగా పనిచేసిన చిన్నికృష్ణ దాదాపు రూ. 3కోట్ల 22లక్షల 75వేల 819మేర నిధులు పక్కదారి పట్టించారు. దాదాపు 10 బ్యాంకు ఖాతాలకు ఈ నిధులను దారి మళ్లించారు. ఇందులో తన కార్యాలయంలో పనిచేసిన మరో ముగ్గుర్ని భాగస్వామ్యం చేసి ఇరికించారు. ఈ వ్యవహారంలో ప్రమేయం వున్న చిన్నికృష్ణతో పాటు కె.రామారావు, కె.మురళీకృష్ణ, ఉమామహేశ్వరరావులతో పాటు పర్యవేక్షణలో వైఫల్యం చెందిన జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కాశీశ్వరరావును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

కమిషనర్ ఆదేశాలతో ఫిర్యాదు..

అక్రమాలకు పాల్పడిన వీరిపై పోలీసు స్టేషన్‌లకు ఫిర్యాదు చేసి, విచారణ జరిపించాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఆదేశించారు. ఈ క్రమంలో యుద్ధ ప్రాతిపదికన ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలకు ఇన్‌చార్జి సెక్రటరీలుగా నియమించి, వారి చేత సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయించారు. స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. విచారణ మొదలైంది. మరో వైపు శాఖా పరమైన విచారణ జరిగింది. చిన్ని కృష్ణ పని చేసిన ప్రతీ చోట విచారణ చేసారు. అవినీతి మొత్తం లెక్క ఇంకా అధికారికంగా తేలలేదు. ఈ క్రమంలో కీలక పాత్రధారి ఎస్. చిన్నకృష్ణను ఆదివారం విశాఖపట్నంలో అదుపులోకి తీసుకుని సోమవారం అరెస్ట్ చూపించామని జేఆర్‌పురం సీఐ ఆదాం సాక్షికి తెలిపారు.

రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11న శ్రీకాకుళం నెహ్రూ యువకేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, జయభేరి ఆటోమోటివ్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి/ఇంటర్/డిగ్రీ/ఫార్మసీ, ఐటీఐ/డిప్లమో మెకానికల్/బీ.టెక్ మెకానికల్ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. అపోలో ఫార్మసీకి ఎంపికైన వారు శ్రీకాకుళం, విశాఖ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని, జయభేరి ఆటోమోటివ్‌కు ఎంపికైన వారు శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, రణస్థలం, పైడిభీమవరం తదితర ప్రాంతాలలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు బుధవారం ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నెహ్రూ యువకేంద్రం వద్దకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.